క్లుప్తంగా

అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధి

ఎంపీడీఓ అనురాధ



మైలవరం: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ పి. అనురాధ పేర్కొన్నారు. మైలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మైలవరం–2025–26 లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌పై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. స్వచ్ఛమైన తాగునీరు పంపిణీ చేయాలని, ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు టీమ్ వర్క్ చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని సూచించారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

శనగలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి



దాములూరు(ఇబ్రహీంపట్నం): శనగ పంట సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి విజయకుమారి అన్నారు. దాములూరు, చిలుకూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి శనగ పంటలను క్షేత్రస్థాయిలో ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు వడలి పోతున్నాయని చెప్పారు. మొక్క మొదళ్లలో ట్రైకోడెర్మా విరిడి ద్రావణం పోసి పక్కమొక్కను వేరుకుళ్లు తెగులు ఆశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. భూమి ఆరోగ్యం కోసం తొలకరిలోనే నవధాన్యాలు చల్లుకోవాలని సూచించారు. వరి సాగు చేస్తున్న రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏఓ డి.శైలజ, రైతులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై బాలికలకు అవగాహన



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా కొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. సంస్థ డెప్యూటీ కార్యదర్శి ఎం.సుశీల మాట్లాడుతూ ఇంధన పరిరక్షణ కోసం ప్రతి ఇంట్లో ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఐరన్ బాక్స్, మిక్సీ, కూలర్ తదితర గృహోపకరణాల వినియోగంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యుత్ వినియోగానికి ప్రకృతిలో సహజ సిద్ధంగా లభించే బొగ్గు, నీరు తరలించడం ద్వారా తరిగిపోతున్నాయన్నారు. నిత్యావసర వస్తువుగా మారిన విద్యుత్‌ను పొదుపుగా వాడాలని చెప్పారు. అధికారులు హరి, వెంకటరావు, హెచ్ఎం సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధే లక్ష్యం

ఎంపీపీ కొండా దుర్గాభవాని



ముసునూరు: ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేయాలని, దీనికి ప్రజల భాగస్వామ్యం అవసరమని ఎంపీపీ కొండా దుర్గాభవాని అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన పంచాయతీ రాజ్ విభాగంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధన, ప్రజా భాగస్వామ్యానికి సంబంధించిన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ బీపీ సత్యనారాయణ, ఏఈలు సత్యప్రసాద్, దుర్గాప్రసాద్, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎ.కొండూరు ఎంపీడీఓ హరిప్రియ మృతి



తిరువూరు: ఎ.కొండూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. హరిప్రియ (36) మంగళవారం రాత్రి విజయవాడలో మృతి చెందారు. ఆస్పత్రిలో కాన్పు సమయంలో బిడ్డకు జన్మనిచ్చిన వెంటనే గుండెపోటు రావడంతో హరిప్రియ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కొద్దికాలంగా ఆమె ప్రసూతి సెలవులో ఉన్నారు. ఎంపీడీఓ మృతికి మండల పరిషత్ సిబ్బంది సంతాపం తెలిపారు.

ఏడేళ్లుగా ఎదురుచూపు



తిరువూరులో అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో ఇళ్లు

- వంద రోజుల్లో టిడ్కో ఇళ్లు పూర్తి చేస్తామన్న అధికారపక్షం
- ఆరు నెలలైనా ప్రారంభంకాని పనులు
- 1300 మంది లబ్ధిదారుల నిరీక్షణ
- అద్దె ఇళ్లల్లో ఇబ్బందులు

తిరువూరు: 2017లో తెలుగుదేశం ప్రభుత్వం తిరువూరు శివారు పాత తిరువూరులో చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం విస్మరించింది. 1300 మంది లబ్ధిదారులకు గత టీడీపీ ప్రభుత్వం ఈ ఇళ్లను నిర్మాణ పనులు పూర్తి కాకుండానే కేటాయించగా తదుపరి లబ్ధిదారుల తరపున బ్యాంకుల్లో రుణాలు కూడా తీసుకున్నారు. ఒకటో కేటగిరీలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే సింగిల్ బెడ్ రూం ఇళ్లకు యూనిట్ ధర రూ.5.72 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించగా, ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ రూ.3 లక్షలు పోను మిగిలిన సొమ్మును ప్రభుత్వమే బ్యాంకు నుంచి రుణంగా తీసుకుంది. ఈ ఇళ్లకు లబ్ధిదారు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. రెండో కేటగిరీలో 365 చదరపు అడుగుల్లో నిర్మించే ఫ్లాట్‌కు రూ.6.74 లక్షలు యూనిట్ ధరగా నిర్ణయించారు. దీనిలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ రూ.3 లక్షలు పోను మిగిలిన సొమ్మును లబ్ధిదారు తరపున ప్రభుత్వం బ్యాంకు నుంచి తీసుకుంది. లబ్ధిదారు వాటాగా రూ.50 వేలు మూడు విడతల్లో చెల్లించాలనే నిబంధన విధించారు. మూడో కేటగిరీలో 430 చదరపు అడుగుల్లో డబుల్ బెడ్‌రూం ఫ్లాట్‌కు రూ.7.71 లక్షల యూనిట్ ధర నిర్ణయించి రూ.3 లక్షల సబ్సిడీ పోను రూ.3.71 లక్షలు బ్యాంకులో లబ్ధిదారు తరపున ప్రభుత్వం రుణం తీసుకుంది. రూ.లక్ష లబ్ధిదారు వాటాగా చెల్లించాల్సి ఉంది.

లబ్ధిదారులపై రుణ భారం

ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణ పనుల నిమిత్తం లబ్ధిదారుల తరపున బ్యాంకుల్లో తీసుకున్న రుణాల వాయిదా సొమ్ము చెల్లించాలని బ్యాంకర్లు లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేయక, తమకు స్వాధీనపరచకుండా ముందస్తుగా రుణాల వాయిదాలు ఎలా చెల్లించాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. గతంలో లాటరీ తీసి కేటాయించిన ఫ్లాట్లలో విద్యుత్, మంచినీరు, ఫ్లోరింగ్, డ్రెయినేజీ సదుపాయాలు కల్పించాల్సి ఉండగా ఇంత వరకు పనులు చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసి అప్పగిస్తామని ఇచ్చిన హామీ నెరవేరకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతున్నందున త్వరితగతిన టిడ్కో ఇళ్లు కేటాయించాలని కోరుతున్నారు.

అలసత్వ ధోరణి



సొంతిల్లు లేని పేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన టిడ్కో ఇళ్ల నిర్మాణంలో అధికారులు అలసత్వ ధోరణి అనుసరిస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న ఈ ఇళ్లు త్వరితగతిన పూర్తి చేయకపోతే శిథిలమయ్యే ప్రమాదం ఉంది. తీసుకోని రుణాలకు లబ్ధిదారులపై బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు.

– షేక్ నాగుల్‌మీరా, తిరువూరు

లబ్ధిదారుల ఇబ్బందులు గుర్తించాలి



గత ఏడు సంవత్సరాలుగా టిడ్కో ఇళ్లు స్వాధీన పరుస్తారని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. అధికారులు ఈ ఇళ్ల నిర్మాణ పనులు పూర్తిచేయకపోవడంతో అద్దె ఇళ్లలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వెంటనే పనులు పూర్తిచేసి ఫ్లాట్లు అప్పగించాలి.

– బి. వెంకటేశ్వరరావు, తిరువూరు

ప్రభుత్వ మార్గదర్శకాలు రాలేదు



టిడ్కో ఇళ్ల పనులు ప్రారంభించడానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. గతంలో అసంపూర్తిగా నిలిచిన పనులను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తే తదనుగుణంగా చర్యలు చేపడతాం.

– లోవరాజు, తిరువూరు నగర పంచాయతీ కమిషనర్

● ఆత్మీయ కలయిక



తిరుపతిరావుకి స్వీటు తినిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, జి.కొండూరు మాజీ ఎంపీపీ వేములకొండ తిరుపతిరావు తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆత్మీయంగా కలిశారు.

–జి.కొండూరు

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



మైలవరంలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మైలవరం: గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. మైలవరంలోని గిరిజన గురుకుల పాఠశాల వద్ద అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 33 రోజులుగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విజయవాడలో ఆందోళన చేస్తున్నారని, వివిధ రూపాల్లో ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి విద్యా శాఖాధికారులు, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. వీరిని కనీసం కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించడంలో ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కావాల్సిన విద్యార్థులు 33 రోజులుగా క్లాసులు జరుగకుండా ఇబ్బందులు పడుతుంటే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం మొండివైఖరి విడనాడి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. నాయకులు ఎం. చరణ్, గిరిజన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రసవాలు ప్రభుత్వాస్పత్రుల్లో జరిగేలా చూడాలి

వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రత్నావళి



లేబర్ వార్డులో గర్భిణితో మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ రత్నావళి

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రత్నావళి బుధవారం సందర్శించారు. జనరల్, సర్జికల్, ఎమర్జెన్సీ వార్డులతో పాటు లేబర్ వార్డులను సందర్శించి రోగులకు, గర్భిణులకు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. ఏరియా ఆస్పత్రి పరిధిలోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి నుంచి తప్పనిసరిగా గర్భిణులు ఏరియా ఆస్పత్రికి వచ్చేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. నరేంద్రసింగ్, డెప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీల స్వీకరణ



లింగాలలో అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రాజకుమారి

లింగాల(గంపలగూడెం): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ రాజకుమారి అన్నారు. గంపలగూడెం మండలం లింగాలలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె వివరణ ఇచ్చారు. సదస్సులో సర్వే కోసం 32, ఆర్ఓఆర్‌కు సంబంధించి 28, ఇతర సమస్యలపై మూడు దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ వీరభద్రం, మండల సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో మూర్తి, రైతులు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం తగిన ఆధారాలతో అర్జీలు అందజేయాలని చెప్పారు. పలువురి నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చీదిరాల మారేశ్వరావు, నక్కా రాము, పుచ్చకాయల నోబుల్ రెడ్డి, సర్వేయర్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

చాట్రాయి: భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ డి.ప్రశాంతి అన్నారు. బుధవారం మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో ఆమె పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా



ఆగిరిపల్లిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ముసునూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించి, స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముసునూరు మండపం సెంటర్, పాత పోస్టాఫీస్ సెంటర్లలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల ముందు చెప్పిన కూటమి నేతలు అధికారం చేపట్టిన అనంతరం చార్జీల భారం మోపారని విమర్శించారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇది మోయలేని భారమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ప్రజలే గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు రమేష్, దుర్గారావు, కుటుంబరావు, మురళి, అనిల్ పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: ప్రజలపై పెంచిన విద్యుత్ చార్జీల భారం వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల విధానాన్ని వెంటనే ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.రాజు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల విధానానికి వ్యతిరేకంగా సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే పేద, మధ్య తరగతి ప్రజల నెత్తిన ట్రూ అప్ చార్జీల పేరుతో పెనుభారం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం ఆగిరిపల్లి మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు, జహింగీర్ బాషా, నాయకులు నరేష్, రవీంద్ర, సుభాకర్ పాల్గొన్నారు.

నూజివీడులో రేపు మెగా జాబ్ మేళా

నూజివీడు: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నూజివీడులో ఈ నెల 20న నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో బుధవారం మంత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలోని స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్‌లో నిర్వహించే మెగా జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని చెప్పారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చాట్రాయి: పోతనపల్లిలో ఏసు క్రీస్తు ప్రార్థన మందిరంలో మంగళవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు. అనంతరం హోప్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గడ్డం శామ్యూల్ జాషువా ఆధ్వర్యంలో 120 మందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టు లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సీతారామరాజు, పాస్టర్ దాసు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్నవారు పేదల పట్ల ఔదార్యం చూపించడం అభినందనీయమని అమెరికాకు చెందిన వైద్యులు కాజా బాబు అన్నారు. మండలంలోని తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో పలువురు దాతల సహకారంతో అందజేసిన కృత్రిమ కాళ్లను ఆయన దివ్యాంగులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్, హీల్ ఇండియా చైర్మన్ రామ అవతార్ యాదవ్, సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నున్న విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● హైటెక్ హరిదాసు



సంప్రదాయాలు కాలానుగుణంగా హైటెక్ రూపాన్ని సంతరించుకుంటున్నాయి. సంక్రాంతి సీజన్ వచ్చిందంటే ఉదయాన్నే హరిదాసు తలపై భిక్ష పాత్ర, భుజంపై తంబూర, చేతిలో భజన కర్రలతో ఇంటింటికీ తిరుగుతూ పద్యాలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ భిక్షాటన చేసేవారు. ప్రస్తుతం హరిదాసులు ద్విచక్ర వాహనంపై వీధుల్లో తిరుగుతూ టేప్ రికార్డుల్లో పద్యాలు వినిపిస్తూ వాహనానికి ఫోన్ పే స్టిక్కరు అంతికించుకుని భిక్షాటన చేస్తున్నారు. ఇలా చాట్రాయి గ్రామంలో హైటెక్ హరిదాసు సంచరిస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. –చాట్రాయి

పాఠశాల స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

గంపలగూడెం: పాఠశాల స్థలాన్ని కొందరు ఆక్రమించారని, విచారణ చేసి చర్యలు తీసుకోవాలని నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. చంద్రం, పీఎంసీ చైర్మన్ మందా జమలయ్య తహసీల్దార్ రాజకుమారికి, పోలీస్‌స్టేషన్‌లో లిఖితపూర్వకంగా బుధవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన దాతలు పాఠశాల కోసం పూర్వ ఆర్ఎస్ నంబర్ 112/ఎ లో 5.41 ఎకరాల భూమిని వితరణగా ఇచ్చారని చెప్పారు. సంబంధిత స్థలంలో 40 సెంట్లను ఆక్రమించారన్నారు. ఈ విషయమై గతంలో అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేసి హద్దు రాళ్లను కూడా పాతారని చెప్పారు. గ్రామస్తుడు కుంభగిరి సతీష్ సోమవారం రాత్రి బడి స్థలాన్ని ఆక్రమించి రేకుల షెడ్ వేశారన్నారు. ఇనపనూరి భారతి, ఊటుకూరు భీమయ్య ఇతరులు కూడా హైస్కూల్ స్థలాన్ని ఆక్రమించి వరిగడ్డి వాములు వేశారని ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత ఆక్రమణలు తొలగించాలని కోరారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

బెల్ట్ షాపులపై దాడులు చేస్తున్నాం

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్

మైలవరం: మైలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారికంగా నిర్వహిస్తున్న సారా విక్రయాలు, బెల్టు షాపులపై ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ నిందితులను అదుపులోకి తీసుకుంటున్నామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. మైలవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బుధవారం 'సాక్షి'లో కమీషన్ల బెల్టు శీర్షికన వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. గత రెండు నెలల్లో 9 సారా కేసులు, 50 బెల్టు కేసులు, 356 బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. బైండోవర్ ఉల్లంఘించిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేశామని, నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయినా అక్కడక్కడా కొంతమంది వైన్ షాపుల వద్ద సేకరించి అనధికారికంగా మద్యం అమ్ముతున్నారని, అటువంటి వారిపై కేసులు పెడుతున్నామన్నారు. సారా, బెల్ట్ షాపులపై సెల్: 99595 10446, 89196 98019 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వర్క్‌షాప్‌లో ఉచిత వైద్య శిబిరం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి రోజు కొద్దిపాటి వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణమైన ఆరోగ్యం సమకూరుతుందని రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. ఆంధ్ర వైద్యశాల సౌజన్యంతో రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్ కార్మికులు, ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ఆంధ్ర వైద్యశాల వైద్యులు అచ్యుతబాబు, డాక్టర్ రమేష్ కార్మికులకు గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సబ్ డివిజనల్ రైల్వే హాస్పిటల్ డాక్టర్లు శ్రీనివాసులు, సుధాకర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేశారు. నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతనపల్లిలో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హసావతు సాయిని అదుపులోకి తీసుకున్నారు.



58 మంది ఉద్యోగాలకు ఎంపిక



తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపిక నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన సదర్లాండ్ బహుళజాతి సంస్థ నిర్వహించిన ఈ ఎంపికలో పలు కళాశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సంస్థ హెచ్ఆర్ విమల్ అభ్యర్థులకు ఎంపిక పరీక్ష నిర్వహించి 58 మందికి నియామక పత్రాలు అందజేశారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

చాట్రాయి: విద్యుత్ సరఫరాలో మార్పులు చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సంజయ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చాట్రాయి, బూరుగుగూడెంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, రైతులు గమనించాలని ఆయన కోరారు.